సాక్షి హనుమకొండ

బుధవారం । 21 । ఆగస్టు । 2024



లక్ష్య సాధకులు..
తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా అన్న దమ్ములు యూపీఎస్సీ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు.
- 8లో▸




ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు..
జిల్లా ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ముఠాను నర్సంపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

ఆర్టీసీకి రాఖీ బొనాంజా

డిపోల వారీగా రాఖీ పండుగ రోజు (ఈ నెల 19న) వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)



- 19న ఒక్క రోజే 5,58,244 మంది ప్రయాణం
- మహిళా ప్రయాణికులు 3,84,633 మంది
- ఆక్యుపెన్సీ రేషియో 119 శాతం
- వరంగల్ రీజియన్‌లో రాఖీ పండుగకు పోటెత్తిన ప్రయాణికులు

హన్మకొండ: రాఖీ పండుగ ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. పండుగ (ఈ నెల 19న) ఒక్కరోజే ప్రయాణికులు అధిక సంఖ్యలో వివిధ రూట్లలో ప్రయాణించారు. సోమవారం ఒక్క రోజే వరంగల్ రీజియన్‌లో 5,58,244 మంది ప్రయాణించారు. ఇందులో 3,84,633 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. చార్జీలు చెల్లించిన ప్రయాణికులు 1,73,611 మంది ఉన్నారు. ఉచితంగా ప్రయాణించిన మహిళలు 69 శాతం ఉండగా, చార్జీలు చెల్లించి ప్రయాణించిన వారు 31 శాతం ఉన్నారు. దీంతో బస్సులన్నీ కిక్కిరిశాయి. సాధారణ రోజుల్లో రోజుకు 3.94 లక్షల మంది వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇంచుమించుగా పండుగ రోజున అంతమంది మహిళా ప్రయాణికులే ఉండడం గమనార్హం. ఆక్యుపెన్సీ రేషియో 119 శాతానికి చేరింది. ఈ ఒక్క రోజు 4.23 లక్షల కిలో మీటర్లు బస్సులు తిరగగా, రూ.3.20 కోట్ల ఆదాయం వచ్చింది. వరంగల్ రీజియన్‌లో సగటున రోజుకు రూ.2.25 కోట్ల ఆదాయం వస్తుంది. పండుగ రోజు అదనంగా రూ.95 లక్షలు వచ్చింది. గత సంవత్సరం రాఖీ పండుగ రోజు 4.19 కిలో మీటర్లు తిరిగిన బస్సులు 98 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రూ.2.58 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. అదే విధంగా ఈ నెల 17న మొత్తం 4.50 లక్షల మంది ప్రయాణించగా ఇందులో ఉచితంగా ప్రయాణించిన మహిళలు 2.84 లక్షలు, వచ్చిన ఆదాయం రూ.234.97 లక్షలు, 18న 4.33 లక్షల మంది ప్రయాణించగా.. ఇందులో ఉచితంగా ప్రయాణించిన మహిళలు 2.67 లక్షలు, ఆదాయం రూ.245.52 లక్షలు.

- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో 142 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.86.53 ఆదాయంతో సగటున తొర్రూరు డిపో అగ్రభాగంలో నిలిచింది.
- పరకాల డిపో 136 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.82.11తో ద్వితీయ, భూపాలపల్లి డిపో 131 ఆక్యుపెన్సీ రేషియోతో కిలో మీటర్‌కు రూ.81.69 ఆదాయంతో మూడో స్థానంలో నిలిచింది.
- వరంగల్-2 డిపో 110 ఆక్యుపెన్సీ రేషియోతో కిలోమీటర్‌కు రూ.69.71 ఆదాయంతో చివరి స్థానంలో నిలిచింది.



అవసరం మేరకు బస్సులు నడిపాం..



రాఖీ పండుగకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా బస్సులు నడిపాం. రాఖీ ముందు రోజుల్లో సెలవులు కలిసి రావడంతో ఆ రోజుల్లో రద్దీ పెరిగింది. అయినా డిమాండ్‌ను బట్టి ఆయా రూట్లలో అదనపు బస్సులు నడిపాం. ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు.
- డి.విజయభాను, వరంగల్ ఆర్‌ఎం

న్యూస్‌రీల్

రాజీవ్ గాంధీకి నివాళి



ఎంజీఎం : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని ఎంజీఎం కూడలిలోని ఆయన విగ్రహానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్ గాంధీయే ఆద్యుడని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి సీపీ పూజలు



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయాన్ని మంగళవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా కుటుంబసమేతంగా సందర్శించారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. సీపీ దంపతులు స్వామివారికి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పురాతన శివాలయాలు సందర్శించడం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. సీపీ వెంట ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ సీఐ సతీష్ ఉన్నారు.

కెమిస్ట్రీ బయో టెక్నాలజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ముస్తఫా, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27, 29, 31, సెప్టెంబర్ 2, 4, 6న పరీక్షలు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.kakatiya. ac.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

ఎంజీఎం : పరిసరాల పరిశుభ్రత, డ్రై డే ప్రాముఖ్యతతోపాటు ఇళ్ల చుట్టూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని హనుమకొండ ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.లలితాదేవి.. వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలు, విద్యార్థులను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్, డీఐఓ డాక్టర్ ఏ.మహేందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇప్తాకర్ అహ్మద్, పీఓఎంహెచ్‌ఎన్ డాక్టర్ నాగరాజు, వైద్యాధికారులు, డెమో వి.అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న డెంగీ



ఎంజీఎంలో 17 రోజుల్లో 29కి పైగా పాజిటివ్ కేసులు

- పదికి పైగా మలేరియా కేసుల నమోదు
- ఆస్పత్రికి రోజురోజుకూ పెరుగుతున్న జ్వర పీడితులు
- హనుమకొండ జిల్లాలో 11 డెంగీ కేసుల నమోదు
- పిల్లల్ని సైతం వణికిస్తున్న విషజ్వరాలు

ఎంజీఎం : గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విషజ్వరాలకు తోడు డెంగీ, మలేరియా కేసులు పెద్దఎత్తున నమోదవుతుండడం వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా చాలామంది విషజ్వరాల బారిన పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 17 రోజుల్లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో 29కిపైగా డెంగీ కేసులు నమోదు కాగా, హనుమకొండ జిల్లా పరిధిలో 11 కేసులు నమోదైనట్లు నివేదికలు తెలుపుతున్నాయి. కానీ.. అనధికారికంగా ఈ సంఖ్య 100కుపైనే ఉండే అవకాశం ఉందని వైద్యులే చెబుతుండడం గమనార్హం.

ఎంజీఎంలో పెరుగుతున్న జ్వరపీడితులు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈతరుణంలో ఎంజీఎం ఆస్పత్రికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా మెడిసిన్, సర్జరీ, ఆర్థో, ఈఎన్‌టీతోపాటు పలు విభాగాలకు చెందిన రోగులతో ఆ సంఖ్య 2 వేలకు పైగానే ఉంటుంది. కానీ.. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మెడిసిన్, ఓపీలతోపాటు జ్వరపీడితుల కోసం ప్రత్యేకంగా ఓపీని ఏర్పాటు చేశారు. ఒక్క మెడిసిన్, ఫీవర్ ఓపీలో రోజూ 500 మందికి పైగా చికిత్సలు పొందుతుండడం చూస్తే విషజ్వరాల వ్యాప్తి ఎలా ఉందో అర్థమవుతోంది. 18 రోజుల్లో 400 మందికి పైగా తీవ్రమైన విషజ్వరాలతో బాధపడుతూ ఎంజీఎంలో చేరి చికిత్స పొందినట్లు వైద్యాధికారులు తెలిపారు.

పిల్లల్ని వణికిస్తున్న డెంగీ, విషజ్వరాలు

విషజ్వరాల వ్యాప్తి పిల్లల్ని వణికిస్తోంది. గత 10 రోజుల్లో ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల విభాగంలో 15కు పైగా డెంగీ కేసులు నమోదు కాగా.. ముగ్గురికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. అంతేకాకుండా 100కు పైగా విషజ్వరాలతో బాధపడుతున్న వారు పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్నారు. పెరుగుతున్న వ్యాధిగ్రస్తులకు అనుగుణంగా వైద్యాధికారులు చికిత్సలు అందిస్తున్నప్పటికీ మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించాలని చిన్నారుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

నాలుగేళ్ల చిన్నారిని బలితీసుకున్న డెంగీ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రానికి చెందిన గూబ అమల, అశోక్ దంపతుల కుమార్తె అద్విత (4) నాలుగు రోజుల క్రితం జ్వరం బారినపడింది. 16వ తేదీన హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. 17న చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా.. డెంగీ బారిన పడ్డట్లు నిర్ధారించారు. ఈనెల 18న పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయింది.



ఎంజీఎంలో విషజ్వరాలతో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులు

ఎంజీఎంలో 17 రోజుల్లో కేసులు

డెంగీ	మలేరియా	వైరల్, ఇన్‌ఫెక్షన్స్
29	15	411

పిల్లల వార్డులో ఇలా..

డెంగీ	మలేరియా	వైరల్, ఇన్‌ఫెక్షన్స్
20	03	118



ఎంజీఎంలోని ఓ వార్డులో చికిత్స పొందుతున్న విషజ్వరాల పీడితులు

హనుమకొండ జిల్లాలో 11 కేసులు నమోదు

హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 11 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. జూన్ 25వ తేదీ నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు జ్వర పీడితుల సర్వే చేయగా.. ఇప్పటివరకు 4వేల మందికిపైగా జ్వరాలతో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా.. మలేరియా కేసులు ఏమీ నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ..

సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో.. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ పెరిగిపోయింది. ర్యాపిడ్ ద్వారా డెంగీ నిర్ధారణ చేస్తూ చికిత్సల పేరుతో రక్త పరీక్షలు, ఇన్‌పేషెంట్ల పేరుతో రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎలిసా టెస్ట్ ద్వారా డెంగీని నిర్ధారణ చేయాలని స్పష్టంగా చెబుతున్నా అనధికారికంగా నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. డెంగీ, మలేరియా చికిత్సలకు కచ్చితమైన ఫీజు తీసుకోవాలనే నిబంధన ఎక్కడా లేదని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు చెబుతున్నారు.

పూర్తి స్థాయిలో వైద్యచికిత్సలు అందిస్తున్నాం..

ఎంజీఎంలో చికిత్స కోసం వచ్చే జ్వర పీడితులకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం. మలేరియాతో పాటు డెంగీ వ్యాధిగ్రస్తులు ఏయే ప్రాంతం నుంచి వస్తున్నారో వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రస్తుతానికి ఎంజీఎం బ్లడ్ బ్యాంక్‌లో డెంగీ చికిత్సకు సరిపడా ప్లేట్‌లెట్స్ అందుబాటులో ఉన్నాయి. ఈనెల 30వ తేదీన ఆస్పత్రికి నూతనంగా అఫారాసిస్ పరికరం లెసెన్స్ కోసం సంబంధిత అధికారుల తనిఖీ ఉంది. అనంతరం ఆ పరికరం అందుబాటులోకి వస్తే ప్లేట్‌లెట్లను రక్తం నుంచి వేరు చేసి ఎక్కువ మోతాదులో నిల్వ చేసే అవకాశం ఉంటుంది.
- డాక్టర్ మురళి, ఎంజీఎం సూపరింటెండెంట్

పశుపత రుద్రహోమంలో మంత్రి పొన్నం

- కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహణ



రుద్రహోమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో అర్చకులు మంగళవారం నిర్వహించిన అఘోర పశుపత రుద్రహోమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు. మంత్రి పొన్నం ఇటీవల నక్షత్ర దీక్ష తీసుకున్న విషయం తెలిసిందే. దీక్షలో ఉన్న ఆయన ఈ హోమంలో పాల్గొన్నారు. అర్చకులు ముందుగా గణపతి పూజ, వర్ధిని శివ కుంభంలో ఆవాహన చేసి ఆవరణ దేవతార్చన, కుంభ సంస్కారం, లక్ష్మి గణపతి హోమం, మూల మంత్రాలు, ఆవరణ హోమాలు, అఘోర పాశుపత రుద్రహోమం, పంచసూక్త హోమాలు నిర్వహించారు. అదేవిధంగా మహా పూర్ణాహుతి, అగ్ని ఉద్వాసన జరిపారు. అనంతరం స్వామివారికి కుంబాభిషేకం, బిల్వపత్రంలతో లక్ష బిల్వార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, మహదాశీర్వచనం చేశారు. అఘోర పాశుపత రుద్రహోమం నిర్వహించడం వల్ల లోక కల్యాణం జరిగి సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు రాష్ట్రం అభివృద్ధి, సస్యరక్షణ జరగనున్నట్లు అర్చకులు వెల్లడించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని రుద్రహోమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓలకు వినతిపత్రం సమర్పించాలని కోరారు. దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, శ్రీకాంత్, రమేష్, వినయ్, సందీప్, వీరభద్రయ్య, శరత్‌చంద్ర, శివకుమార్, శ్రావణ్, గురుప్రసాద్, రాజేందర్, భిక్షపతి, రాజు, నక్షత్ర దీక్ష స్వాములు, తదితర నాయకులు పాల్గొన్నారు.

31నుంచి కాజీపేట దర్గా ఉర్సు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ వాకడే, దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా, 'కుడా' చైర్మన్ వెంకట్రామిరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు నిర్వహిస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో దర్గా ఉర్సు ఉత్సవాలపై కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలన్నారు. అధికారులు, ఉద్యోగులు ఒక టీంగా ఏర్పడి ఎలాంటి పొరపాట్లు జరగకుండా త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతుందని, ఈ దర్గాకి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వస్తారన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాల విజయవంతానికి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఉత్సవాల సందర్భంగా శానిటేషన్, ఇతర పనుల కోసం ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ 25వ తేదీ నాటికి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ ఆర్డీఓ, ఏసీపీ, జీడబ్ల్యూఎంసీ అధికారులు కలిసి పరిశీలించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మందులతోపాటు 24 గంటలు వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ నుంచి ఉర్సు జరిగే ప్రాంతానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. రైల్వే క్రాసింగ్ వద్ద టెక్నికల్ సిబ్బందిని నియమించి ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు ఉర్సు ఉత్సవాల ప్రాంతంలో అవసరమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజన్ ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా, డిప్యూటీ మేయర్ రిజ్వాన్ షమీం, మైనారిటీ కమిషన్ మెంబర్ దర్శన్ సింగ్, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీను, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వచ్చే శనివారం లోపు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. మంగళవారం హనుమకొండలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట సంపూర్ణంగా ఉన్న దరఖాస్తులను పరిశీలించి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు అన్ని జత చేశారా లేదా అనేది చూడాలన్నారు. ప్రభుత్వ స్థలం, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదా లేదా అనేది పరిశీలించాలన్నారు. గ్రామాలు, సర్వే నంబర్‌ల ఆధారంగా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్తే పని సులువు అవుతుందన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో బృందంలోని సభ్యులందరూ లాగిన్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఉద్యోగులు వారికి కేటాయించిన మండలానికి సంబంధించిన దరఖాస్తులు మాత్రమే పరిశీలించాలన్నారు. షెడ్యూల్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. దరఖాస్తుదారులకు ముందుగా సమాచారం అందించి వెళ్లాలన్నారు. తద్వారా వారు అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. పట్టా ఉన్నవారి, మాస్టర్ ప్లాన్‌లో ఉన్న వారి దరఖాస్తులను సులభంగా నమోదు చేయవచ్చన్నారు. నాలుగు రోజుల్లో సంపూర్ణంగా ఉన్న 100 దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు. అవసరమైన డాక్యుమెంట్లు జతచేయని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్ మహా నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌ఓ గణేష్, హనుమకొండ ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఓపెన్‌స్కూల్'ను సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శంకర్‌రావు తదితరులు

ఆత్మకూరు: విద్యార్థులు ఓపెన్ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఓపెన్ పదవ, ఇంటర్ విద్యకు సంబంధించిన బ్రోచర్లు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన వారు, మహిళలు, వివిధ వృత్తిపనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకొని కోర్సులు పూర్తి చేయవచ్చన్నారు. ఆత్మకూరు సెంటర్‌లో చేరే వారు కోఆర్డినేటర్ బొమ్మెర సోమయ్య (9394019001) ను సంప్రదించాలని సూచించారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుల్ల నిర్మలకుమారి, ఉపాధ్యాయులు వేమారెడ్డి, సమత, శ్రీదేవి, రాజు, గ్రేష్మ, వసంత, రజిత, భాగ్యమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన తల్లీకొడుకులతో సీఐ హరికృష్ణ, రైల్వే సిబ్బంది

కమలాపూర్: ఓ తల్లి తన ఐదేళ్ల కొడుకుతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వారిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని శనిగరానికి చెందిన వక్కల పద్మ భర్త కిరణ్ మద్యానికి బానిసై గొడవ పడుతుండేవాడు. ఆ గొడవలు భరించలేక పద్మ.. తన ఐదేళ్ల కుమారుడు నాగచైతన్యతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పడుకుంది. గమనించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ హరికృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని తల్లీకొడుకులను కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ పద్మతోపాటు భర్త కిరణ్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పద్మ సోదరుడు బొడిగె అజయ్‌ను కోమటిపల్లి నుంచి పిలిపించి అతనితో ఆమెను పుట్టింటికి పంపించారు. తల్లీకొడుకులను కాపాడిన సీఐ హరికృష్ణ, పోలీసు సిబ్బందిని పలువురు అభినందించారు.

ప్రశ్నించే తత్వంతోనే శాస్త్రీయ అభిరుచి

● కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: ప్రశ్నించే తత్వంతోనే శాస్త్రీయ అభిరుచి సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని కెమిస్ట్రీ విభాగంలో జనవిజ్ఞానవేదిక, కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ శాస్త్రవేత్తలు నోబెల్ బహుమతికి అర్హులన్నారు. గొప్ప శాస్త్రవేత్తల అనుభవాల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. తెలంగాణ జనవిజ్ఞాన వేదిక సెక్రటరీ, విశ్రాంత వరంగల్ నిట్ ఆచార్యుడు కె. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అనేక సమస్యల సమాధానం సైన్స్‌లో ఉందన్నారు. జనవిజ్ఞానవేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కె. పురుషోత్తం మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, జీవవైవిధ్యం కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సైన్స్‌విభాగాల డీన్ జి.హనుమంతు మాట్లాడుతూ ఇంకా మూఢనమ్మకాల్లో కొట్టుమిట్టాడుతుంటే వాటినుంచి బయటపడాలంటే సైన్స్ మాత్రమే మార్గం అన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్, బీఓఎస్ చైర్మన్ ఎస్.జ్యోతి మాట్లాడారు. ఈసమావేశానికి కెమిస్ట్రీ విభాగం అధిపతి సవితాజ్యోత్స్న అధ్యక్షత వహించి మాట్లాడారు.

రేపు ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని యూనివర్సిటీ కళాశాలల, అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం గురువారం (ఈనెల 22న) ఉదయం 11గంటలకు క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్స్, వివిధ క్రీడాపోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారని తెలిపారు.



లక్ష్య సాధకులు..

యూపీఎస్సీ ఫలితాల్లో మెరిసిన అన్నదమ్ములు

● కేంద్ర ప్రభుత్వ కొలువులకు ఎంపిక
● ఆదర్శంగా నిలుస్తున్న గిరిపుత్రులు


ఆంగోతు ఆనంద్


ఆంగోతు సంతోశ్

నర్సంపేట : ఆ అన్నదమ్ములు.. ఉన్నత ఉద్యోగం సాధించాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నారు. దీనికి ఓ లక్ష్యం విధించుకున్నారు. ఈ మార్గంలో ఎన్నో ఆటంకాలు, ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా తట్టుకుని ప్రణాళిక ప్రకారం చదివి గమ్యం చేరుకున్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షకు అనుగుణంగా యూపీఎస్సీ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు ఈ గిరిపుత్రులు. వారే నర్సంపేట పట్టణానికి చెందిన ఆంగోత్ భద్రయ్య–అరుణ దంపతుల కుమారులు సంతోశ్, ఆనంద్. ఇటీవల యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో సంతోశ్ ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో మైనింగ్ ఇంజనీర్, ఆనంద్ కేంద్ర కార్మిక శాఖలో లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగం సాధించారు. ఒక ఉద్యోగం సాధించడమే కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో ఉద్యోగం చేస్తూనే మరో ఉద్యోగానికి అదీ జాతీయ స్థాయి ఉద్యోగాలకు సన్నద్ధమై సాధించడం గొప్ప విశేషం.

విద్యాభ్యాసం..

సంతోశ్, ఆనంద్ ఇద్దరూ ప్రాథమిక విద్యను నర్సంపేటలో పూర్తి చేశారు. సంతోశ్ పదో తరగతి హనుమకొండ, ఇంటర్ హైదరాబాద్, కర్ణాటక ఎన్ఐటీలో ఇంజనీరింగ్, జైపూర్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం అల్ట్రాటెక్ సిమెంట్స్ (ఆదిత్య బిర్లా)లో ఇంజనీర్‌గా, కొంత కాలం పేటీఎం సంస్థలో, జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థలో రెండు సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. సివిల్స్ లక్ష్యంగా ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్నారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే.. మరోపక్క ఖాళీ సమయంలో పోటీ పరీక్షకు సన్నద్ధమై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో ఇంజనీర్ కొలువు సాధించారు. ఆనంద్ పదో తరగతి బిట్స్ స్కూల్, ఇంటర్, ఇంజనీరింగ్ హైదరాబాద్, వరంగల్ ఎన్ఐటీలో ఎంబీఏ పూర్తి చేశారు. టీసీఎస్‌లో స్టాఫ్‌వేర్, ఆ తర్వాత చెన్నై పెట్రోలియం సంస్థలో హెచ్‌ఆర్ అధికారిగా పని చేస్తూనే యూపీఎస్సీ ద్వారా కార్మిక శాఖలో ఉద్యోగం సాధించాడు.

ప్రణాళిక ప్రకారం చదివి.. లక్ష్యం చేరుకుని..

ఉన్నత చదువులతో జీవితంలో స్థిరపడిన తమ బాబాయ్‌లు, తల్లిదండ్రులను సంతోశ్, ఆనంద్ ఆదర్శంగా తీసుకున్నారు. యూపీఎస్సీలో ఉన్నత ఉద్యోగం సాధించాలని లక్ష్యం విధించుకున్నారు. ఈ నేపథ్యంలో సంతోశ్ రెండు దఫాలు(గ్రూప్–ఏ) ప్రిలిమ్స్, మెయిన్స్ వరకు వెళ్లారు. అయితే ఆ ఫలితాలు నిరాశకు గురిచేశాయి. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడకుండా మూడో ప్రయత్నంలో (గ్రూప్–బీ) గమ్యం చేరుకున్నాడు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్‌లో మైనింగ్ ఇంజనీర్ కొలువు సాధించాడు. ఇక ఆనంద్ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. కేంద్ర కార్మిక శాఖలో లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగం సాధించారు. ఈ అన్నదమ్ములు సుమారు సంవత్సరం కాలం పుస్తకాలతో దోస్తీ పట్టారు. ఎప్పుడూ చదువు ధ్యాసే. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యం చేరుకున్నారు. ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచారు.

కుటుంబ నేపథ్యం..

సంతోశ్, ఆనంద్ తల్లిదండ్రులు ఆంగోత్ భద్రయ్య–అరుణ దంపతులది వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం భోజెర్వు గ్రామం జగ్గుతండా. భద్రయ్య తల్లిదండ్రులు ఆంగోత్ చీమా–మల్కమ్మ. ఈ దంపతులకు నలుగురు కుమారులు భద్రయ్య, తారాసింగ్, మోహన్, విజేందర్ ఉన్నారు. భద్రయ్య టీచర్‌గా, తారాసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా, మోహన్ పిల్లల వైద్య నిపుణుడిగా, విజేందర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో తమ తండ్రి తప్ప అందరూ డాక్టరేట్‌లుగా ఉన్న తమ బాబాయ్‌లను స్ఫూర్తిగా తీసుకున్న సంతోశ్, ఆనంద్.. చిన్నప్పటి నుంచే చదువులో రాణిస్తూ వచ్చారు. ఉద్యోగ రీత్యా వీరి కుటుంబం నర్సంపేటలో స్థిరపడింది. సంతోశ్, ఆనంద్ తల్లి అరుణ వైద్య ఆరోగ్యశాఖలో ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్–1 అధికారి, తండ్రి భద్రయ్య చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పని చేస్తున్నారు.


తల్లిదండ్రులు భద్రయ్య–అరుణతో ఆనంద్, సంతోశ్ (ఫైల్)

బాలిక మృతి కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సురేశ్, పక్కన నర్సింహులపేట ఎస్సై సురేశ్

తొర్రూరు : ఆకతాయి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక.. చికిత్స పొందుతూ ఈ నెల 18వ తేదీన మృతి చెందింది. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తొర్రూరు డీఎస్పీ వి. సురేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ఓ తండాకు చెందిన ఓ బాలిక(17) పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతోంది. ఈ క్రమంలో ఖమ్మం చెందిన వంగ సాయి సదరు బాలికను ప్రేమపేరిట వేధింపులకు గురిచేశాడు. దీంతో ఈ వేధింపులు తట్టుకోలేక ఈ నెల 15న బాలిక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు బాలికను మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నర్సింహులపేట పోలీసులు దర్యాప్తు చేశారు. భరోసా సెంటర్ మహిళా ఎస్సై ఆసుపత్రిలో బాలిక మృతికి ముందు వాంగ్మూలం నమోదు చేశారు. దీని ప్రకారం వంగసాయిని అరెస్ట్ చేసి పోక్సో కేసు, ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో నర్సింహులపేట ఎస్సై మాలోత్ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

● 19 విద్యుత్ మోటార్లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

డోర్నకల్ : ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను డోర్నకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం డోర్నకల్ సీఐ బి.రాజేశ్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ఓ ట్రాలీ వాహనం పోలీసులను తప్పించుకుని వెళ్లే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. వాహనంలో రెండు విద్యుత్ మోటార్లు, రెండు స్కూటీలు కనిపించడంతో అదుపులోకి విచారణ చేపట్టారు. పదిమంది ముఠా సభ్యులు నాలుగు నెలల నుంచి వివిధ ప్రాంతాల్లో విద్యుత్ మోటార్లు, ఇనుము చోరీ చేస్తున్నట్లు గుర్తించి ఖమ్మంలోని మామిళ్లగూడేనికి చెందిన పాత ఇనుప సామను దుకాణం నిర్వాహకురాలు వీరబోయిన ముత్యాలు, ఇదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ కొట్టే గణేశ్, తేజావత్ సుందర్‌లాల్, రఘునాథపాలేనికి చెందిన మొగిలి నాగరాజు, తేజావత్ జోహర్‌లాల్, చంద్రుగొండ మంగీలాల్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం ట్రాలీ వాహనం, రెండు స్కూటీలు, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అంతర్‌జిల్లా ముఠాలోని ఇతర సభ్యులు రఘునాథపాలెం మండలానికి చెందిన శ్రీను అలియాస్ వెంకటేశ్, కొత్తగూడేనికి చెందిన శివతో పాటు ఇద్దరు బాలురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన నిందితురాలు ముత్యాలు ట్రాలీ వాహనాన్ని అద్దెకు తీసుకుని ఇతర నిందితులతో కలిసి ఇప్పటి వరకు 19 విద్యుత్ మోటార్లతో పాటు టన్నున్నర ఇనుము అపహరించినట్లు ఎస్పీ తెలిపారు. డోర్నకల్ మండలంలో ఏడు మోటార్లతో పాటు టన్నున్నర ఇనుము, కురవిలో రెండు, రఘునాథపాలెంలో ఐదు, చింతకానిలో రెండు, నర్సింహులపేట, తల్లాడ, ఖమ్మం రూరల్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున విద్యుత్ మోటార్లను చోరీ చేసినట్లు తెలిపారు. ఖమ్మంలో దాచిన మోటార్లను గొల్లచర్ల సమీపంలో దాచేందుకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్‌కు ర్యాంకుల పంట

● ఎన్ఐఆర్ఎఫ్–98
● యూనివర్సిటీ విభాగంలో 101–150
● ఓవరాల్ 151–200


వరదారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి

హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ (ఎన్ఐఆర్ఎఫ్)–2024 విడుదల చేసింది. ఎన్ఐఆర్ఎఫ్‌తో పాటు యూనివర్సిటీ, ఓవరాల్ ర్యాంకులను కూడా ప్రకటించింది. ఈ జాబితాలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఎస్సార్ యూనివర్సిటీకి చోటు దక్కింది. ఎస్సార్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు సాధించినట్లు యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. అలాగే, యూనివర్సిటీ విభాగంలో 101–150 ర్యాంకు దక్కించుకుంది. ఓవరాల్ కేటగిరీలో 151–200 ర్యాంకు సాధించినట్లు చాన్స్‌లర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రైవేట్ ఇంజనీరింగ్ సంస్థల్లో ఇంజనీరింగ్ విభాగంలో ర్యాంకు సాధించిన ఏకైక సంస్థ ఎస్సార్ యూనివర్సిటీ అని చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్ విడుదల చేస్తున్న జాబితాల్లో ఇప్పటి వరకు ఎస్సార్ యూనివర్సిటీ 100లోపు ర్యాంకు సాధిస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ అకడమిక్, ప్లేస్‌మెంట్స్,రీసెర్చ్, ఇన్నోవేషన్‌ల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తూ వస్తున్నట్లు వివరించారు. ఈసందర్భంగా ఎస్సార్ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి, డాక్టర్ మహేశ్, డాక్టర్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు..

● ముగ్గురి అరెస్ట్.. ఒకరు పరారీ
● రూ. 7.35 లక్షలు, మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ కిరణ్ కుమార్

నర్సంపేట రూరల్: జిల్లా ఆస్పత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేసిన ముఠాను అరెస్ట్ చేసినట్లు నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. నవోదయ ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం నర్సంపేట జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో కొత్తగా ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే అదునుగా భావించిన ఓ ముఠా.. నవోదయ ఏజెన్సీ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు వసూలు చేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 16వ తేదీన నాంచారి కుమారస్వామి అనే వ్యక్తి తన ఉద్యోగం కోసం ముఠా సభ్యులకు రూ. 10వేలు ఇచ్చాడు. ఈ విషయం తెలియడంతో హనుమకొండకు చెందిన నవోదయ ఏజెన్సీ బాధ్యురాలు పిండి స్వప్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నర్సంపేటలో ప్రారంభించబోయే జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల వద్ద ఈనెల 20న ముగ్గురు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 17 మంది మంది వద్ద రూ. 7.35 లక్షలు వసూలు చేసినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నలుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నారు. అరెస్ట్ అయిన వారిలో హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన పోరండ్ల శివ, నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన ధారావత్ శరత్‌చంద్ర, సంగెం మండలం గవిచర్లకు చెందిన శ్రీసాయి కోస్టల్ మాన్ పవర్ సప్లయిర్ ఏజెన్సీ బాధ్యుడు ఎండీ ఖాజామోయినోద్దీన్‌ను అరెస్ట్ చేయగా, వరంగల్ దేశాయిపేటకు చెందిన అకినపెల్లి కవిత పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. ఈసందర్భంగా సీఐ రమణామూర్తి, సిబ్బంది బాబు, రాఘవులు, రవి, కృష్ణ, తానీషా, మాన్‌సింగ్‌ను ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

● రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


రామప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రులు కృష్ణారావు, సీతక్క

వెంకటాపురం(ఎం): పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాగరాజుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. 800 సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయం నేటికి చెక్కు చెదరలేదన్నారు. ప్రతి నెల ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తే మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ లక్నవరంలో ఏర్పాటు చేసిన ఉయ్యాల వంతెన తరహాలో రామప్పలో కూడా ఏర్పాటు చేయాలని మంత్రి కృష్ణారావును కోరారు. పర్యాటకులకు అన్ని వసతులు కల్పించి రామప్ప రిజర్వాయర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్య మరణం తట్టుకోలేక.. భర్త మృతి

● మనుగొండలో ఘటన


లలిత, కుమారస్వామి(ఫైల్)

గీసుకొండ: కలకాలం తనకు తోడుగా ఉంటానని పెళ్లిలో వేద మంత్రాల సాక్షిగా ప్రమాణం చేసిన భార్య అర్ధాంతరంగా తనువు చాలించింది. దీంతో ఆ బాధ తట్టుకోలేక భర్త మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తుప్పరి లలిత(49), కుమారస్వామి(56) దంపతులు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఈ క్రమంలో లలిత ఇటీవల బాత్ రూంలో కాలు జారి పడి తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూసింది. తన భార్య మృతి తట్టులోని కుమారస్వామి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ దంపతుల మృతి మనుగొండలో విషాదం నింపింది. కాంగ్రెస్ నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం పంపించగా కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కూనమల్ల అనిల్, ఎంబాడి పరమేశ్వర్ తదితరులు మృతుల కుటుంబ సభ్యులకు అందించారు.

వదిన మృతదేహాన్ని చూసి ఆడబిడ్డ..


కూసం సరోజన(ఫైల్)


తొర్రూరు అమృతమ్మ(ఫైల్)

దుగ్గొండి: వదిన మృతదేహాన్ని చూసి గుండెపోటుతో ఆడబిడ్డ మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గుడ్డేలుగులపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన తొర్రూరు అమృతమ్మ (72) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఆత్మకూరు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన ఆమె ఆడబిడ్డ కూసం సరోజన (62) వదిన అంత్యక్రియల కోసం మంగళవారం గుడ్డేలుగులపల్లికి వచ్చింది. ఉదయం 11 గంటలకు సరోజన.. వదిన మృతదేహాన్ని చూసి ఐదు నిమిషాల పాటు బోరున విలపించింది. ఆ వెంటనే గుండెనొప్పితో ఆమె కుప్పకూలింది. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. కొన్ని గంటల వ్యవధిలోనే వదిన, ఆడబిడ్డ ఇద్దరు మృతి చెందడంతో గుడ్డేలుగులపల్లి, మహ్మద్‌గౌస్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జ్వరంతో మహిళ మృతి

● గుడితండాలో ఘటన


శిరీష(ఫైల్)

కేసముద్రం: జ్వరంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని బోడమంచ్యా తండాజీపీ శివారు గుడితండాలో చోటుచేసుకుంది. తండావాసుల ప్రకారం.. తండాకు చెందిన బోడ శిరీష(30), బాలు దంపతులకు కుమార్తె హారిక, కుమారుడు గణేశ్ ఉన్నారు. శిరీషకు వారం క్రితం జ్వరం రావడంతో మొదట ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకుంది. ఆ తర్వాత కూడా తగ్గకపోవడంతో మానుకోటలోని ఓ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 18న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందింది. డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

రూ.30 లక్షలు తీసుకుని చంపారు

● మాజీ సర్పంచ్ హత్య కేసులో సుపారీ గ్యాంగ్ అరెస్ట్
● వివరాలు వెల్లడించిన వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య


సుపారీ గ్యాంగ్ అరెస్ట్ చూపుతున్న ఏసీపీ నర్సయ్య, పోలీసు అధికారులు

వర్ధన్నపేట: రూ. 30 లక్షల డీల్ కుదుర్చుకుని మాజీ సర్పంచ్‌ను హత్య చేసిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఈమేరకు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుపారీ గ్యాంగ్ అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో జూన్ 7వ తేదీన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ హత్య కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ హత్యకు కారణమైన ఏ–1 పల్లె మురళిని విచారించగా గ్రామానికి చెందిన పల్లె ముకేశ్‌తో సాయంతో సుపారీ గ్యాంగ్ ఏర్పాటు చేసి మాజీ సర్పంచ్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం గిద్దలూరుకు చెందిన సుంకర ప్రసాద్‌రెడ్డి, రాయపర్తి మండలం బురహాన్‌పల్లికి చెందిన పల్లె ముకేశ్, హైదరాబాద్‌లోని కాప్రా మండలం జవహర్‌నగర్‌కు చెందిన మార్నేని రాజు, నారాయణపేట మండలం ఆభంగపూర్‌కు చెందిన కర్జోల్ల కృష్ణయ్య.. సుపారీ తీసుకుని మాజీ సర్పంచ్‌ను హత్య చేసినట్లు మురళి తెలిపారు. ఈ క్రమంలో ఈ నలుగురు మంగళవారం ఖమ్మం జైలులో ఉన్న మురళితో ములాఖత్‌లో కావడానికి కారులో వెళ్తుండగా రాయపర్తి మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకుని విచారించగా నేరం అంగీకరించారు. మాజీ సర్పంచ్ హత్యకు రూ. 30లక్షలు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా పరిచయం చేసుకుని దేవేందర్‌ను నమ్మించారు. అనంతరం పల్లె మురళి, పల్లె ముకేశ్‌తో పాటు ఈ నలుగురు దేవేందర్‌ను హత్య చేశారు. కాగా, ఇప్పటి వరకు రూ. 14 లక్షలు ఇచ్చారని, మిగతా డబ్బులు తర్వాత ఇస్తామని డీల్ నిర్వాహకులు తెలిపారని ఏసీపీ నర్సయ్య వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ సూర్య ప్రకాశ్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సుపారీ గ్యాంగ్ పై పలు కేసులు

సుంకర ప్రసాద్ రెడ్డి, మార్నేని రాజు గతంలో చాలా నేరాల్లో ఉన్నారు. ఇప్పటికే సుంకర ప్రసాద్ రెడ్డిపై మూడు హత్య కేసులు, మహబూబ్‌నగర్, కర్నూల్, కడప జిల్లాల్లో 10 వరకు నకిలీ నక్సలైట్ కేసులు, గంజాయి కేసు, అనంతపురం జిల్లా గుంతకల్లు రూరల్ పీఎస్‌లో రెండు కిడ్నాప్ కేసులు, 10 వరకు చోరీ కేసులతోపాటు మరికొన్ని క్రిమినల్ కేసులు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా మార్నేని రాజుపై నల్లగొండ రూరల్, సదాశివపేట, చిన్న కోడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు హత్య కేసులు, కిడ్నాప్ కేసులు, హైదరాబాద్‌లో 10 వరకు చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.